క్లుప్తంగా

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో సత్తా

ఆదోని సెంట్రల్: ఆదోని మండలం ఆరెకల్లు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న రాజు రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో ప్రతిభను కనబరిచి బంగారు పతకం సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు నంద్యాల పురపాలక ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 త్రోబాల్ పోటీల్లో విద్యార్థి రాజు సత్తా చాటి బంగారు పతకం కైవసం చేసుకున్నాడని తెలిపారు. క్రీడాకారుడు రాజుతో పాటు శిక్షణ ఇచ్చిన వ్యాయమ ఉపాధ్యాయురాలు విజయ సుశీలను అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టులో ఆదోని విద్యార్థికి చోటు


సాయి రిషి

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని అక్షరశ్రీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి సాయి రిషి రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టులో చోటు సంపాదించినట్లు పాఠశాల డైరెక్టర్ యం. మేఘనాథరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి అధ్వర్యంలో ఇటీవల నంద్యాలలో జరిగిన అండర్-14 విభాగం ఇంటర్ డిస్ట్రిక్ పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎన్నికైనట్లు తెలిపారు. వచ్చే నెల కేరళలో జరిగే జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా సాయి రిషిని ప్రత్యేకంగా అభినందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న సెబ్ సీఐ హరికృష్ణ

ఆదోనిరూరల్: పట్టణంలోని బసాపురం క్రాస్ రోడ్డు వద్ద ఆదోనికి చెందిన బోయ సూర్య, నరసింహులు బైక్‌పై అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డారని సెబ్ సీఐ హరికృష్ణ శుక్రవారం తెలిపారు. వారి నుంచి 22 మద్యం బాక్సులను స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐలు శివప్రసాద్, డీటీఎఫ్ ఎస్‌ఐ స్వామినాథన్, సిబ్బంది ఉన్నారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన పౌరసరఫరాల అధికారి


ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కేవీఎస్‌ఎం ప్రసాద్

ఆదోనిరూరల్: ఆదోని సబ్ కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ను నూతనంగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిగా నియమితులైన కేవీఎస్‌ఎం ప్రసాద్ కలిశారు. మర్యాద పూర్వకంగా కలిసినట్లు ఆయన చెప్పారు. పౌర సరఫరాశాఖ ద్వారా లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం అందించే సబ్సిడీ రేషన్, ఇతర నిత్యావసర సరుకులను సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

కౌతాళం: శ్రీరామ జన్మభూమి అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తయి మహాప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా అక్కడి భగవాన్ రామ్‌లల్లా విరాజమాన్‌ను పూజించిన పవిత్ర అక్షింతలను ప్రతిఒక్కరూ తీసుకెళ్లాలని విశ్వహిందు పరిషత్ నాయకుడు చంద్రశేఖర్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పవిత్రమైన అయోధ్య అక్షింతలను ప్రతి గ్రామానికి పంపిణీ చేస్తామన్నారు. శనివారం అక్షింతలను ప్రతి గ్రామంలోని సంఘాల సభ్యులకు అందజేస్తామని తెలిపారు. ప్రఖండ కార్యదర్శులు, ప్రఖండ అభియాన్ ప్రముఖులు, అన్ని గ్రామాల సంయోజకులు తరలివచ్చి అయోధ్య చిత్రపటాలు, కరపత్రాలను తీసుకెళ్లాలని కోరారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లను పంపిణీ చేస్తున్న అవోపా సభ్యులు

ఆదోనిఅర్బన్: అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఆదోని అవోపా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన త్యాగానికి గుర్తుగా 80 మంది పేదవారికి దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం పంజరాపోల్ గోశాలలో పశుగ్రాసం అందించారు. అవోపా పట్టణ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా, కార్యదర్శి మిరియాలశ్రీధర్, సభ్యులు ఈరన్నశెట్టి, రఘు, కిరణ్, రంగ, రాజేష్, మమతశ్రీ, సంగీత, బిందు, గీత తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతల కళ్లలో వెలుగులు

- మూడున్నరేళ్లలో 10 వేల మందికి కంటి పరీక్షలు
- ఆరోగ్యశ్రీ ద్వారా 3,550 మందికి ఆపరేషన్లు


కంటి ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ పద్మకుమార్

ఆదోనిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ, జగనన్న ఆరోగ్య సురక్ష పథకాలతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందుతోంది. రోడ్డు ప్రమాదాలు, గుండె జబ్బులు, కేన్సర్, గుండెమార్పిడి, ఎముకల సంబంధించిన జబ్బులకు ఉచితంగానే వైద్యం లభిస్తుండడంతో ఎందరికో పునర్జన్మ లభిస్తోంది. ప్రధానంగా ఈ పథకం కింద అవ్వాతాతలకు ఉచితంగా కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేసి కళ్లజోడును సైతం ప్రభుత్వమే అందిస్తోంది. కంటి జబ్బులతో బాధపడుతూ సరిగా చూపు కనిపించక ఇబ్బందులు పడుతున్న అవ్వతాతలకు కంటిచూపు నిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

ఆరోగ్యశ్రీ పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరింతగా విస్తరింపజేశారు. గతంలో 1590 జబ్బులకు వైద్యసేవలు అందే పరిమితిని ప్రస్తుతం 3 వేల జబ్బులకు చికిత్స చేసేలా చర్యలు చేపట్టారు. దీంతో ప్రతి పేదోడు ఉచితంగా కార్పొరేట్ వైద్యం పొందుతున్నారు. ముఖ్యంగా ఆరేడు పదుల వయస్సులో ఉన్న అవ్వాతాతలకు ప్రభుత్వమే ఉచితంగా కంటి పరీక్షలు చేయించి వారి జీవితాల్లో వెలుగు నింపుతోంది. నిస్సహాయ స్థితిలో జీవనం సాగిస్తున్న వృద్ధులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆపరేషన్లు కూడా చేయించి కళ్ల జోడు అందిస్తుండడంతో వృద్ధులు పట్టలేనంత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధుల ఆరోగ్యానికి ఇంతటి ప్రాధాన్యత నిచ్చే ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని రాజన్న కొడుకు జగనన్నకే మా మద్దతు అంటూ ప్రకటిస్తున్నారు. ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మూడున్నరేళ్లలో దాదాపు 10 వేల మందికి పైగా కంటి పరీక్షలు, 3 వేల మందికి ఆపరేషన్లు చేశారు.

మూడేళ్లలో 3 వేల మందికి కంటి ఆపరేషన్లు

ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మూడున్నరేళ్లలో డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పేద, అవ్వాతాతలకు దాదాపు 3 వేల మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేశారు. 10 వేల మందికి పైగానే పరీక్షలు నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ పథకాల కింద పేదలకు వైద్యాన్ని అందిస్తున్నారు. దీంతో పేదలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కేసుల వివరాలు

- 2021లో 545 ఆపరేషన్ కేసులు
- 2022లో 1047 ఆపరేషన్లు
- 2023లో 853 కేసులు ఆపరేషన్లు చేశారు.

ఆదోనిలో ముగ్గురు పీజీల వైద్యసేవలు

ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఏడాదికి 500 కేసులకు పైగానే కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేస్తూ లక్ష్యం చేరుకున్నారు. అత్యంత వెనకబడిన ఆదోని ప్రాంతానికి మరింత మెరుగైన వైద్య సేవలు, కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేసేందుకు ప్రభుత్వం ముగ్గురు పీజీలను నియమించింది. దీంతో డాక్టర్ పద్మకుమార్‌తో పాటు ముగ్గురు పీజీలు కళ్ల జబ్బులకు సంబంధించి వేగంగా చికిత్సలు అందిస్తున్నారు.

ఒక్కరూపాయి ఖర్చులేకుండా వైద్యం



ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కంటి ఆపరేషన్లు బాగా చేస్తారు. గతేడాది నా భర్త ఉసేన్‌సాబ్‌కు కూడా ఆపరేషన్ చేయించాం. ఆపరేషన్ వల్ల ఎంతో మేలు జరిగింది. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ పథకం కింద కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేస్తున్నారు. గతంలో ఇలా జరగలేదు. జగనన్న పాలనలో మహిళల సంబంధిత జబ్బులకు పరీక్షలు చేస్తున్నారు. ముఖ్యంగా కళ్లల్లో ఏర్పడిన పొరలను తొలగించడం, ఆపరేషన్లు చేయడం ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుంది.

– రజియాబీ, ఖాజీపుర వీధి

కంటి సమస్యతో ఇబ్బంది ఉండేది



రోజూ బేల్దారి పనికి వెళ్లి కళ్లల్లో ఇసుక, సిమెంట్, మట్టి పడి కళ్లు మసకబారాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి ఆపరేషన్లు బాగా చేస్తున్నారని చెప్పడంతో అక్కడికి వెళ్లాను. పరీక్షలు చేశారు. ఆపరేషన్ కూడా చేయించుకుంటున్నాను.కళ్లు బాగా కనిపిస్తే మరికొద్ది కాలం బేల్దారి పని దొరుకుతుంది. సంవత్సరం క్రితం నా భార్య సరోజకు ఆపరేషన్ చేయించాను. ఇప్పుడు కళ్లు బాగా కనిపిస్తున్నాయి. గతంలో కంటికి తూతూ మంత్రంగా పరీక్షలు చేసి పంపేవారు. ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లి వేలకు వేలు డబ్బులు ఖర్చు పెట్టుకొని ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బందులు తప్పాయి.

– ఆంజనేయులు, బేల్దారి, కార్వన్‌పేట

లక్ష్యాన్ని సాధించాం



ఏడాదిలో 500కు పైగా కంటి ఆపరేషన్లు పూర్తి చేసేలా ప్రభుత్వం లక్ష్యం నిర్ణయిచింది. ఆ లక్ష్యాన్ని అధిగమించాం. కంటి జబ్బుతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చే ప్రతిఒక్కరికీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తున్నాం. అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తున్నాం. ఆదోని డివిజన్‌లోని ఎమ్మిగనూరు, మంత్రాలయం, కౌతాళం, ఆలూరు నియోజకవర్గాల పరిధిలోని పేదలు ఆపరేషన్ల కోసం వస్తారు. వారికి పూర్తిస్థాయిలో పరీక్షించి, ఆ తర్వాతనే ఆపరేషన్లు చేస్తాం.

– డాక్టర్ పద్మకుమార్,కంటి వైద్యనిపుణులు, ఆదోని ఏరియా ఆస్పత్రి

ఈరోజు

మండల సమావేశం

కౌతాళం: మండల సర్వసభ్య సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ సుబ్బారాజు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నేడు (శనివారం) మండల పరిషత్ కార్యాలయంలో జరుగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ హాజరు కావాలని అలాగే వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో రావాలన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని రాంజల ఏరియా, ఎల్‌బజీ, ఎంబజీ, హెచ్‌బజీ, అరుంజ్యోతి నగర్, పెద్ద మాదిగేరి, కునిముల్లా, మండిగిరి పంచాయతీలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ పురుషోత్తం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోతలు ఉంటాయని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

ఆదోనిరూరల్: ప్రధానమంత్రి విశ్వకర్మ కౌశల్ పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విట్టా రమేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు మలేకర్ శ్రీనివాసులు, బీజేపీ ఆదోని అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజుగౌడ్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం వికసిత భారత్ సంకల్పయాత్ర 11వ రోజు కార్యక్రమం ఆదోని మండలంలోని జాలిమంచి, పాండవగల్లు గ్రామాల్లో జరిగింది. వివిధ శాఖలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వారు వివరించారు. 18 సంప్రదాయ కులవృత్తుల వారికి ఆర్థిక తోడ్పాటు అందించి, ఉపాధి చేకూర్చాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల వివరాలతో నూతన క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంక్షేమం


సంక్షేమ పథకాలను వివరిస్తున్న వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు నిండాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దకడబూరు మండలంలోని హెచ్.మురవణి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు మంజూరయ్యాయని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, విజేంద్ర రెడ్డి, నాయకులు దేవదానం, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులకు ఘన నివాళి


పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సబ్‌కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, అధికారులు

ఆదోనిరూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన చేసిన సేవలు, ప్రాణత్యాగం వెలకట్టలేనివని, ఆయన కృషిని ప్రతి పౌరుడు స్మరించుకోవాలన్నారు. ఉప తహసీల్దార్ వలీబాషా, కౌసర్‌బాను, దీపా, సీనియర్ సహాయకులు రామచంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కుమనిషికి నివాళి


మున్సిపల్ కార్యాలయంలో పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్: ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ వర్ధంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డీఈ నాగభూషణ్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


బసాపురంలో సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోనిరూరల్: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం బసాపురం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న ఎమ్మెల్యే ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4:10 గంటల వరకు 345 గృహాలను సందర్శించారు. ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? అని ఆరా తీశారు. కాలనీలో మంచి నీరు, వీధి దీపాలు, డ్రెయినేజీ, రోడ్లు, తదితర సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో ప్రతి ఇంటికి రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్ జగనన్న ప్రజలకు నేనున్నాననే భరోసా కల్పించారన్నారు. ఎలాంటి అవినీతి, లంచాలకు తావు లేకుండా సంక్షేమ పథకాల నగదును నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమచేస్తున్నట్లు వివరించారు. ఎస్సీ కాలనీలో సచివాలయ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ స్కూల్‌లో రూ.48 లక్షలతో అదనపు తరగతి గదులు నిర్మాణ దశలో ఉన్నాయని, జలజీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీరు, పైపులైన్ వేయాలని ఆదేశించారు. కొత్త విద్యుత్ స్తంభాలు మంజూరు చేసి లైట్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సర్పంచ్ ఈరమ్మ, వీరేష్, ఎంపీటీసీ శశిధర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రమేష్, నాయకులు కామాక్షి తిమ్మప్ప, దేవిశెట్టి మంజుల, రేణుక, శ్రీలక్ష్మి, గురునాథ్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, సీతారామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన


కోసిగిలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న డీపీఓ టి.నాగరాజునాయుడు

కోసిగి: మండలంలో ఓటరు జాబితాలోని అభ్యంతరాలు, నమోదు ప్రక్రియ, మార్పులు, చేర్పుల విషయంపై జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజు నాయుడు పరిశీలించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి తహసీల్దార్ రుద్రగౌడ, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో మండలంలోని బీఎల్‌ఓల సమక్షంలో ఇటీవల కొత్తగా నమోదైన ఓటరు జాబితాను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఫారం-6 దరఖాస్తులు 401, ఫారం-7 దరఖాస్తులు 61, ఫారం-8 దరఖాస్తులు 89 వచ్చినట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండి ఓటు హక్కు లేని వారు తమ గ్రామాల్లో బీఎల్‌ఓలను కలిసి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీఎల్‌ఓలు, వీఆర్వోలు ఉన్నారు.

కౌతాళం: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఓటరు జాబితా రూపకల్పన కార్యక్రమాన్ని శుక్రవారం డీపీఓ నాగరాజునాయుడు పరిశీలించారు. ఫారం-6 ,7, 8లపై వచ్చిన దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి ఏఏ దరఖాస్తులు ఎన్ని వచ్చాయనే విషయాలను పోలింగ్ బూత్‌ల వారీగా తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితా రూపకల్పనలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. డీపీఓను ఎంపీడీఓ సుబ్బారాజు, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, కార్యదర్శులు చెన్నయ్య, శ్రీరాములు మర్యాద పూర్వకంగా కలిశారు.

సంక్షేమ ప్రదాత సీఎం జగన్


సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోనిటౌన్: సంక్షేమ ప్రదాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణాధ్యక్షుడు దేవా, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫయాజ్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం 35వ వార్డు అమరావతినగర్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దేవా, ఫయాజ్‌అహ్మద్ మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ తండ్రికి తగ్గ తనయుడిగా సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ ద్వారా వేలాది మందికి ప్రాణం పోస్తున్నాడన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ పరిష్కరించి పేదల ఇళ్లలో వెలుగులు నింపారన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేద్దామని పిలుపునిచ్చారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, పట్టణ కార్యదర్శి పర్వీన్‌బాను, నాయకులు సింహం నాగేంద్ర, ఎర్రిస్వామి, పీరా, లక్ష్మన్న, మాబాషా, వెంకటేశ్వర శెట్టి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ధనుర్మాస పూజలు

ఆదోనిఅర్బన్: పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన ఆంజనేయస్వామి సన్నిధిలో ఆదివారం నుంచి జనవరి 15వ తేదీ వరకు ధనుర్మాస పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ వాసుదేవరావు శుక్రవారం తెలిపారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థ శ్రీపాదులవారి ఆదేశాల మేరకు మంగరాయ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిరోజు పొంగల్, తీపి పొంగల్, నైవేద్యం సమర్పించనున్నట్లు తెలియజేశారు. వివరాలకు 9985706489 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ నియామకం

ఆదోని సెంట్రల్: సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు గుంతకల్ డివిజన్ పరిధిలోని ఆదోని రైల్వే స్టేషన్‌కు 'స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ' మెంబర్లను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్టేషన్ నామినేటెడ్ పదవులలో ఆదూరి విజయ్ కృష్ణ, జిందే సాయికుమార్, రమేష్ ఆచారి, చిల్లాలే దత్తా, కునిగిరి లక్ష్మీకాంత్ కమిటీ సభ్యులుగా ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రైల్వే శాఖ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అత్యంత సమర్థవంతంగా పనిచేస్తుందని తెలిపారు. రైల్వే స్టేషన్‌ను ఆధునీకీకరించి ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆదోని రైల్వే స్టేషన్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. తమకు పదవులు కేటాయించిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పరిపాలనపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ప్రసాద్

కౌతాళం: సాధారణ పారిపాలనపై మండల పరిషత్ అధికారులు, కార్యదర్శులకు అవగాహన కలిగి ఉండాలని ప్రత్యేక అధికారి కేవీఎస్‌ఎం ప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులందరూ పారిపాలన విభాగంలో అన్ని విషయాలపై అవగహన కలిగి ఉండాలన్నారు. తీర్మానాలపై ప్రజలు ఇచ్చే అర్జీలపై ఎలా స్పందించాలన్న విషయాలను తెలుసుకోవాలన్నారు. పంచాయతీ పరిధిలో జరిగే అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని సూచించారు. మండలంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. ఉపాధి పనులు, మరుగుదొడ్ల నిర్మాణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ సుబ్బరాజు, హౌసింగ్ డీఈ లాలికృష్ణయ్య, ఎంఈఓ శోభరాణి, ఏపీఓ జుబేర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని బసాపురం రోడ్డు, మార్కెట్ యార్డు గేటు సమీపంలో వెలసిన గవి వీరయ్యస్వామి ఆరాధన మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. మఠం భక్త బృందం ఆధ్వర్యంలో స్వామివారికి వేకువజాము నుంచి ధర్మ ధ్వజారోహణం, మహారుద్రాభిషేకం, గణరాధన, ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. స్వామివారిని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సవరణ

శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆ బ్యాంక్ లి॥ ఆదోని 15.12.2023న ప్రచురించిన బంగారు నగల వేలం ప్రకటనలో నికర బరువు స్థానంలో స్థూల బరువు, స్థూల బరువు స్థానంలో నికర బరువు ప్రచురించడమైనది. దీనిని ఖాతదారులు గమనించగలరు.

ఇట్లు సీఈఓ
శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లి॥, ఆదోని

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల సభ్యుల నియామకం

మంత్రాలయం: నియోజకవర్గాల వారీగా వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల సభ్యులను నియమిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో నియోజకవర్గానికి చెందిన బీసీ సెల్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడిగా పి.ఈరన్న, ప్రధాన కార్యదర్శిగా వైటీ బసన్న, కార్యదర్శులుగా లక్ష్మన్న, మారెప్ప, సహాయ కార్యదర్శులుగా అయ్యప్ప, లక్ష్మయ్య ఎంపికయ్యారు.

- క్రిస్టియన్ మైనార్టీ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడిగా దాసు, ప్రధాన కార్యదర్శిగా ఉమేష్, కార్యదర్శులుగా జయరాజు, సునీల్ కుమార్, సహాయ కార్యదర్శిగా జయపాల్ ఎన్నికయ్యారు.
- కల్చరల్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కార్యదర్శులుగా ఎం.గౌడ్, నాగేష్, సహాయ కార్యదర్శులుగా ఉస్మాన్, వీరేష్,
- మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పల్లవి, కార్యదర్శులుగా సావిత్రి, రాజేశ్వరి, సహాయ కార్యదర్శులుగా నీల, సరస్వతి
- మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ ఖాజాసాహెబ్, కార్యదర్శులుగా కల్లుకుంట ఖాజాసాబ్, అమీన్, సహాయ కార్యదర్శులుగా అబ్దుల్, రహీం
- పంచాయతీరాజ్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, కార్యదర్శులుగా నీలకంఠరెడ్డి, రామలింగయ్య స్వామి, సహాయ కార్యదర్శులుగా బసిరెడ్డి, పరశురాముడు
- పబ్లిసిటీ విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలిగా భారతి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్‌రెడ్డి, కార్యదర్శులుగా గాదిరెడ్డి, పాండురంగన్న, సహాయక కార్యదర్శులుగా నరసన్న, నాగరాజు
- రైతు విభాగం జిల్లా ప్రెసిడెంట్‌గా అత్రితనయగౌడ్, ప్రధాన కార్యదర్శిగా పరమేష్, కార్యదర్శులుగా అనిల్‌కుమార్, గోపాల్‌రావు, సహాయ కార్యదర్శులుగా ఉరుకుందప్ప, సుబ్బరాజు
- ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా రామాంజినేయులు, ప్రధాన కార్యదర్శిగా నాగప్ప, కార్యదర్శులుగా తిక్కన్న, రాజు, జాయింట్ కార్యదర్శులుగా సురేష్, అవతారం
- ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగేష్, కార్యదర్శులుగా పద్మమ్మ, మల్లయ్య, సహాయ కార్యదర్శులుగా సిద్దా, హనుమంతునాయక్
- విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఖాజాహుస్సేన్, కార్యదర్శులుగా హరీష్‌కుమార్, ప్రసన్నబాబు, సహాయ కార్యదర్శులుగా కుమార్, సురేంద్ర ఎన్నికయ్యారు.

జయప్రదం చేయండి

కౌతాళం: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 10వ జిల్లా మహాసభలు ఈనెల 18, 19 తేదీల్లో ఎమ్మిగనూరులో నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి ఈరన్న తెలిపారు. శుక్రవారం మండలంలో జీపుజాతాలో వారు మాట్లాడుతూ మహాసభకు రైతులు, తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

